క్లుప్తంగా

11న ఎమ్మార్పీఎస్ 'విశ్వరూపం'

కొడంగల్ రూరల్: పార్లమెంటు శీతాకాల సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అంజి మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ.. గురువారం అంబేడ్కర్ కూడలిలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇందులో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సోమశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్, బొంరాస్‌పేట మండల ఇన్‌చార్జి తిరుపతి, నాయకులు అశోక్, ఎంఎస్ఎఫ్ నాయకులు మధు, మహేశ్, దశరథ్, వెంకటేశ్, మనోహర్, నరేష్ ఉన్నారు.

అఖండ హరినామ కీర్తనలో భజన మండలి



కీర్తనలో పాల్గొన్న మండలి సభ్యులు

కొడంగల్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ కీర్తనలో రుద్రారం గ్రామ భజనమండలి సభ్యులు పాల్గొన్నారు. 1,2 తేదీల్లో ఉదయం, సాయంత్రం నాలుగు గంటల పాటు అఖండ హరినామ కీర్తనలో పాల్గొన్నట్లు సభ్యులు తెలిపారు. పదేళ్లుగా ఏటా రెండు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో తమకు అవకాశం కల్పిస్తుందని సభ్యులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

కొడంగల్ రూరల్: కొడంగల్ మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎస్ఎం.గౌసన్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఏర్పాటు సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతోనే రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

పరిగి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన దాద్దు, బుజ్జి బాయిలు దంపతులు నాలుగు నెలల క్రితం పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు దిగారు. స్థానికంగా ఓ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవారు. భార్య భర్తలు ఇద్దరూ తరచూ గొడవ పడేవారు. దీంతో మనస్తాపానికి గురైన దాద్దు(36) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, ఇంటి యజమాని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే దాద్దు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి యజమాని జయప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి



కవాతు చేస్తున్న పోలీసులు

బంట్వారం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు బార్వాద్‌లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరు సీఐ రామకృష్ణ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. ఇందులో కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి, ఏఎస్ఐ అంబదాస్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు తిరుగులేదు

- సంక్షేమ పథకాలే కొండంత అండ
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్కాములే
- వారితో ఒరిగేదేమీ లేదు
- ఇంటింటి ప్రచారంలో ప్రజాప్రతినిధులు, గులాబీ శ్రేణులు



కుల్కచర్ల: తిర్మలాపూర్‌లో గులాబీ శ్రేణుల ప్రచారం



నవాబ్‌పేట: ముబారక్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగే లేదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధి ముబారక్‌పూర్, గుబ్బడిపత్తేపూర్ గ్రామాల్లో గురువారం ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి కొండంత అండ అని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని, వారి పాలనలో స్కాములు తప్పా స్కీములు లేవన్నారు. 60 ఏళ్లలో ప్రజలకు ఏమీ చేయని వారు.. ఇప్పుడు ఏం ఒరగబెడతారని ప్రశ్నించారు. మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని, వారి మాటలు నమ్మితే ఆగం అవుతామని పేర్కొన్నారు. వారితో అయ్యేది లేదు పోయేదు లేదన్నారు. వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచులు బాలమణి, విర్జినమ్మ, బల్వంత్ రెడ్డి, ఎండీ రఫీ, పర్మయ్య, అజయ్‌కుమార్, రత్నం, నాయకులు నాగిరెడ్డి, చిట్టిపు మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, కదీర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి..

దౌల్తాబాద్: అభివృద్ధిని చూసి ఆదరించండి అని బీఆర్ఎస్ కొడంగల్ అభ్యర్థి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం మీ ఎదుటే ఉండి, సేవకుడిలా పనిచేసిన నాకు ఓటేస్తారో.. ఆర్నెల్లకోసారి వచ్చి పోయే వారికి ఓటేస్తారో ప్రజలే ఆలోచించుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కోట్ల రూపాయలకు టికెట్లు అమ్ముకున్న రేవంత్‌రెడ్డి మళ్లీ మీ వద్దకు వస్తున్నారని, ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ భర్త ఏపూరి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ భర్త భీములు, వార్డు సభ్యులు ఈశ్వరప్ప, బాలప్పతో పాటు 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీజెడ్పీటీసీ మొహన్‌రెడ్డి, ప్రమోద్‌రావు, నరోత్తంరెడ్డి తదితరులు ఉన్నారు.



తాండూరు రూరల్: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అభివాదం



దౌల్తాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మరింత అభివృద్ధి చేస్తా..

తాండూరు రూరల్: స్థానికంగా ఉండే తనను గెలిపిస్తే తాండూరును మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కరన్‌కోట్ గ్రామంలో మైనార్టీలు యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వసంత్‌కుమార్, ఉప సర్పంచ్ హేమంత్‌కుమార్, యూత్ అధ్యక్షుడు సుధకర్‌గౌడ్, నాయకులు శివకిషోర్, షేక్ హుసేన్, అఫ్రోజ్, సమీర్ పాషా, రహేమద్, చోను, దావూద్ తదితరులు ఉన్నారు.

ఆనంద్‌ను గెలిపించండి..

వికారాబాద్ అర్బన్: కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ సబిత కోరారు. ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ పరిధి ఎన్నెపల్లి, సాకేత్ నగర్, కమలానగర్‌లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె మాట్లాడారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆమె కోరారు. పార్టీ కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షకీల్ ఉన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి డాక్టర్ సబితా

బీఆర్ఎస్‌తోనే న్యాయం

కుల్కచర్ల: బీఆర్ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు మహేశ్వరం రాములు, గుండుమళ్ల నర్సింహులు అన్నారు. ఎన్నికల నేపథ్యంలో కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధిక దుగుబడికి సాంద్రత పద్ధతి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున



లింగాకర్షణ బుట్టల ఆవశ్యకతను రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త

పూడూరు: అధిక సాంద్రత కలిగిన పంటలను సాగు చేసి, అదే స్థాయిలో దిగుబడులు పొందాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున సూచించారు. కేంద్ర పత్తి పరిశోధన కేంద్రం ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా గురువారం పూడూరు మండలం చింతలపల్లిలో రైతులు రాములు, వెంకటేశ్ వేసిన అధిక సాంద్రత గల పత్తి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ఇందులో పత్తిలో కలుపు తీయుట, తదితర యాజమాన్య పద్ధతులను వివరించారు. పత్తి సాగు ఆవశ్యకత, దిగుబడిని పెంచే విధానాన్ని రైతులకు తెలిపారు. పత్తిలో అంతర పంటల సాగుతో పాటు, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి చీడపీడలను నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మణ్, వెంకటేశ్, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దౌల్తాబాద్: మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తిరుమల స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

● కంట్రోల్ రూంకు కాల్ చేయండి..

అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారని, మత్తు పదార్థాలు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. అనుమానిత వ్యక్తులు సంచరించినా, ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిసినా రాష్ట్ర కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్ 18004252523, జిల్లా కంట్రోల్ రూం నంబర్ 8074559147కు ఫోన్ చేయాలని కోరారు.

● రేవంత్ కోసం హెలిప్యాడ్

కొడంగల్: ఎన్నికల నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయడానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం హెలిక్యాప్టర్ సౌకర్యం కల్పించింది. అందుకు తాండూరు రోడ్డులో హెలిప్యాడ్ సిద్ధం చేస్తున్నారు. రేవంత్.. నిత్యం ఇక్కడి నుంచే ప్రచారానికి వెళ్లనున్నారు. ఉదయం బయలుదేరి సాయంత్రానికి కొడంగల్‌కు రానున్నారు.

● డెంగీ కేసు నమోదు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన మాధురికి డెంగీ సోకిందని వైద్యులు తెలిపారు. దీంతో నవాబుపేట్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

● కష్టపడి చదివితే ఉత్తీర్ణత

మోమిన్‌పేట: కష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధ్యమని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలని, పబ్లిక్, ప్రాక్టికల్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

● ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా దీపక్‌రెడ్డి

తాండూరు టౌన్: ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా దీపక్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి నియామక పత్రాన్ని.. కాంగ్రెస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడతానని, జిల్లాలో ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

● రూ.3 లక్షలు పట్టివేత

తాండూరు టౌన్: ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న సోదాల్లో పోలీసులు రూ.3లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక వినాయక్ చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ.3 లక్షలు లభించాయి. నగదుకు సంబంధించిన పత్రాలు చూపకపోవటంతో వాటిని స్వాధీనం చేసుకొని, స్క్రీనింగ్ కమిటీ సభ్యులకు అందజేసినట్లు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.

● వికటించిన వైద్యం

కుల్కచర్ల: చెయ్యి నొప్పి భరించలేక వైద్యున్ని సంప్రదిస్తే.. సూదిమందు వికటించి చేయి వాపు వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి వాల్యానాయక్ తండాకు చెందిన మాణిఖ్యనాయక్ చేయి నొప్పితో చికిత్స కోసం బుధవారం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. నొప్పి తగ్గేందుకు వైద్యుడు రెండు ఇంజక్షన్‌లు ఇచ్చారు. వైద్యం వికటించడంతో చేతికి వాపు వచ్చింది. భయపడిన రోగి గురువారం మరోసారి ఆస్పత్రికి వెళ్లగా.. ఆస్పత్రికి రావద్దని, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకోవాలని సదరు వైద్యుడు హుకుం జారీ చేశాడు. దీంతో బాధితుడు గిరిజన సంఘాలను ఆశ్రయించాడు. సంఘాల నేతలు ఆస్పత్రి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, రోగం నయమయ్యే వరకు చికిత్స అందించాలని రాజీ కుదిర్చారు.

● రోహిత్‌ను గెలిపించండి: ప్రమోదినిరెడ్డి

బంట్వారం: తన కొడుకును మరోసారి గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి వికారాబాద్ జెడ్పీటీసీ ప్రమోదినిరెడ్డి కోరారు. ఆమె కోట్‌పల్లి మండలం ఓగులపూర్, ఇందోల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, సర్పంచ్ శోభారాణి ఉన్నారు.

● జోరుగా బెల్టుషాపులు!

తాండూరు రూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో బెల్టు దుకాణాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు విఫలమయ్యారు. తాండూరు మండలం మల్కాపూర్ పోలీస్, ఎక్సైజ్ అధికారుల ఆదేశాలు బేఖాతారు చేస్తూ పలువురు యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తు వేళ.. పల్లెల్లో ఇలా మద్యం విక్రయిస్తే, గొడవలు జరిగే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి బెల్టు దుకాణాలను అరికట్టాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే మేలు



వికారాబాద్ అర్బన్: గ్యారంటీ పథకాల గురించి వివరిస్తున్న చైర్‌పర్సన్



కుల్కచర్ల: పొలంలో పనిచేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- పేదలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌ను ఆదరించండి
- అధికారంలోకి వస్తే అర్హులందరికీ గ్యారంటీ పథకాలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డిలు కోరారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరగాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వస్తే ఐదు గ్యారంటీ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్ చందర్ నాయక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేతల పొలం బాట

కుల్కచర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పొలంబాట పట్టారు. చెరువుముందలి తండాలో రైతులు, కూలీలు పొలం పనుల్లో ఉండగా.. వారి వద్దకు వెళ్లి అధిష్టానం ప్రకటించిన గ్యారంటీ పథకాలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అవినీతి పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే అందరికీ మేలు జరుగుతుందని, చేయి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, అంతారం సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీపీ అంజిలయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు సాయన్న, కుమ్మరి స్వామి, ఎల్లయ్య, సోమలింగం, ఘనపూర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీలో పలువురి చేరిక

బొంరాస్‌పేట: మండల పరిధి ఎన్కేపల్లిలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ కుర్వ సందయ్య, మాజీ ఉప సర్పంచ్ రాంచంద్రప్ప, వార్డు సభ్యుడు సంగెం అంజి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, బాలయ్య, నర్సింహులు ఉన్నారు. ఇందులో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అధికారంలోకి రాగనే రుణమాఫీ

పూడూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి తిర్మలాపూర్‌లో ఆయన ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరిగిందని, అధికారంలోకి రాగానే ఏక కాలంలో రుణమాఫీ, ఇంటింటికీ ఆరు గ్యారంటీ పథకాలను అందజేస్తామని పేర్కొన్నారు. డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు

పరిగి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి టి. రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి రూప్‌ఖాన్‌పేట్ తదితర గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అవినీతి ప్రభుత్వాన్ని అంతమొందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని వృథాచేశారని ఆరోపించారు. పేదలకు న్యాయం జరగాలంటే చేతికి గుర్తుకు ఓటేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు ఉన్నారు.

పక్కాగా ఆరు గ్యారంటీలు

నవాబుపేట: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ భార్య జ్యోతి అన్నారు. ఆమె కార్యకర్తలతో కలిసి నవాబుపేట, యావపూర్, తిమ్మారెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. మాటమీద నిలబడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఇందులో బి బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్

ధారూరు: కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన అల్లిపూర్, చింతకుంట, హరిదాస్‌పల్లిలో ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి మయంగా మారిన బీఆర్ఎస్‌ను ఓడించి, కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అప్పుడే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, ఎంపీటీసీలు బసప్ప, రవీందర్, శ్రీనివాస్, నాయకులు హన్మయ్య, నర్సిరెడ్డి, మహ్మద్ బాబాఖాన్, ఇబ్రహీం, అశోక్, మాన్‌సింగ్, నారాయణరెడ్డి, గఫార్, బుజ్జయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ఆరుబయటే కార్యకలాపాలు

సొంత భవనాలు లేక ఇక్కట్లు

- అంగన్‌వాడీ, వాటర్ షెడ్లలో కొనసాగుతున్న జీపీల పరిపాలన
- పట్టించుకోని అధికారులు
- నిర్మాణాలకు గ్రామస్తుల డిమాండ్



గిర్మాపూర్‌లో వాటర్ ఫిల్టర్ షెడ్‌లో కొనసాగుతున్న జీపీ భవనం

పెద్దేముల్: గ్రామ పంచాయతీ భవనాలు లేక గ్రామ స్థాయి పాలకులు ఇబ్బంది పడుతున్నారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేయాలన్నా ఆరు బయట లేక, అద్దె భవనాలే దిక్కవుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా జీపీ భవనాలు మంజూరు చేసినా.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పర్యవేక్షణ కొరవడి అవి ముందుకు సాగటం లేదు.

12 భవనాలు మంజూరు

పెద్దేముల్ మండలంలో గతంలో 25 గ్రామ పంచాయతీలు ఉండేవి. ప్రభుత్వం ఐదేళ్ల క్రితం కొత్తగా గిర్మాపూర్, మారేపల్లితండా, సిద్దన్న మడుగుతండా, ఎర్రగోడుతండా, ఖాజాపూర్‌తో పాటు మొత్తం 12 జీపీలను ఏర్పాటు చేసిం ఇందులో కలపగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 37కు చేరింది. ఇదిలా ఉండగా.. కొత్తగా ఏర్పాటైన జీపీలకు పరిపాలన నిమిత్తం ప్రభుత్వం నూతనంగా భవనాలను మంజూరు చేసింది. అందుకు గాను ఒక్కో భవన నిర్మాణానికి రూ.20లక్షలకు పైగా నిధులు సమకూర్చినట్లు తెలుస్తోంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వలన రెండుమూడు ప్రాంతాల్లో మినహా మిగతా చోట్ల అసలు వాటి ఊసే లేనట్లు సమాచారం. ఫలితంగా అంగన్‌వాడీ, పాఠశాల లేదా అద్దె భవనాల్లో గ్రామ పాలకులు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

వాటర్ ఫిల్టర్ షెడ్‌లో..

గిర్మాపూర్ గ్రామంలో జీపీ భవనం లేక గతంలో అంగన్‌వాడీ భవనంలో పంచాయతీ కార్యకలాపాలు కొనసాగేవి. అక్కడ ఖాళీ చేయమనడంతో ప్రస్తుతం వాటర్ ఫిల్టర్ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లో పాలన కొనసాగిస్తున్నారు. గ్రామ సభ ఏర్పాటు చేయాలంటే షెడ్ ఎదుట ఉన్న చింతచెట్టు కింద కొనసాగుతోందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీలకు మంజూరైన పంచాయతీ భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



నూతన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం కొత్త భవనాలు మంజూరు చేసిన విషయం వాస్తవమే. కానీ పనుల ప్రారంభంలో కాస్త ఆలస్యం అయింది. వెంటనే ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మాట్లాడి భవనాలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బండపల్లితో పాటు పలు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

– లక్ష్మప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్ మండలం

పైలట్‌కు మద్దతు పలకడం సిగ్గుచేటు

తాండూరు టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్ రెడ్డికి బీసీ సంఘం మద్దతు పలకడం సిగ్గు చేటని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్.. తాండూరు బరిలో ఉన్న బీసీ అభ్యర్థికి మద్దతు పలక కుండా, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రోహిత్‌కు అనుకూలంగా వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని చెప్పిన బీజేపీ మాటలు వినలేదా అని ప్రశ్నించారు.

బరాబర్ రోహిత్‌రెడ్డికే మద్దతు

తాండూరు టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్ రెడ్డికే బీసీ సంఘం బరాబర్ మద్దతు ఇస్తుందని ఆ సంఘం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతి అన్నారు. బీసీల సమస్యలపై ఏనాడూ మాట్లాడని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించడంపై ఇష్టానికి మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆదేశానుసారం రోహిత్‌కు అండగా ఉండి గెలిపిస్తామన్నారు.

నేటి నుంచి నామినేషన్ల షురూ

- ఉదయం 11 నుంచి 3 గంటల వరకు స్వీకరణ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు

తాండూరు టౌన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్ కార్యాలయం వద్ద నేటి నుంచి అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించనున్నట్లు తాండూరు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస రావు అన్నారు. గురువారం ఎన్నికల సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసీ ఆదేశానుసారం శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నామినేషన్లను స్వీకరిస్తామని వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల లోపు కార్యాలయ ఆవరణలో ఉన్న వారందరి నామినేషన్లు తీసుకుంటామని పేర్కొన్నారు. అభ్యర్థితో పాటు కేవలం ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని, కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సీసీ కెమెరాలతో నిఘా..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. అంతే కాకుండా భారీగా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ స్టేషన్లను మరోసారి సరి చూసుకోవాలని, ఓటు వేయడానికి వచ్చిన వారికి తగిన సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్, తహసీల్దార్లు తారాసింగ్, వెంకటస్వామి, కిషన్, మునీరుద్దీన్, డీఏఓ మహేశ్ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.